సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



ఫేక్ ఇన్సూరెన్స్ తీసుకొని మోసపోవద్దు

కొందరు ఫేక్ ఇన్సూరెన్స్ కట్టించి మోసగిస్తున్నారని, ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని డీటీసీ మీరాప్రసాద్ అన్నారు. -8లో..



టూరిస్ట్ బస్సు ప్రమాదంలో మరొకరు మృతి

టూరిస్ట్ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. గురువారం రాత్రి ఇద్దరు దుర్మరణం చెందారు. -8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.6/25.2

జిల్లాలో శుక్రవారం 25.2 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కలెక్టర్‌తో సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: కడపలోని కేంద్రీయ విద్యాలయ యాజమాన్య కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయరామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ విద్యాలయ ప్రవేశాలు, 10, 12వ తరగతుల ఫలితాలు, భవన నిర్వహణ, మరమ్మతులు, విద్యాలయ పురోగతికి చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి తగిన ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో విద్యాలయ యాజమాన్య కమిటీ సభ్యులు హేమాంగ్ వెంకటేష్, ప్రిన్సిపాల్ పద్మజారాణి, అధ్యాపకులు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27 వరకు జిల్లాలో వర్షాలు

కడప ఎడ్యుకేషన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 27వ తేదీ వరకు జిల్లాలోని పలు మండలాల్లో చిరుజల్లుతోపాటు మోస్తరు వర్షం కురుస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య, వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. జమ్మలమడుగులో అత్యధికంగా 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొండాపురంలో 36.8 , కాశినాయనలో 32, మైలవరంలో 21.4, పెద్దముడియం, బి. కోడూరులలో 14.6, కలసపాడులో 12.6, వల్లూరులో 4.6, సింహాద్రిపురంలో 2.2, సిద్ధవటంలో 2 , రాజుపాలెం, దువ్వూరులలో 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు రక్తదాన శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకల సందర్భంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలి ఆదేశాలతో యువ మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కడపలోని మహరాజా మినీ ఫంక్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన విజయ్ హాజరవుతారని చెప్పారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న ఈఎండీపీ జిల్లా మేనేజర్ కరీముల్లా

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఈ దిశగా పిల్లల్లో ఆలోచన ధోరణిని ఉపాధ్యాయులు పెంచాలని ఈఎండీపీ జిల్లా మేనేజర్ కరీముల్లా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ)లో భాగంగా జిల్లాలో 160 పాఠశాలల విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కడప చెమ్ముమియాపేట బాలికల హైస్కూల్, పాఠశాలల్లో జరుగుతున్న శిక్షణను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉద్యోగం కోసం కాకుండా సొంతంగా ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా ఆలోచన చేయాలన్నారు. జిల్లాలో ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని పాఠశాలలు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

కేవీకే ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు


మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త వీరయ్య

కడప అగ్రికల్చర్: కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, మొక్కలు అందిస్తున్నామని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య అన్నారు. కడప నగర శివారులోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని పులివెందుల ప్రాంత వాటర్ షెడ్ రైతులు శుక్రవారం సందర్శించారు. వానపాము ఎరువు తయారీ, బ్లాక్ బెంగాల్ మేకల పెంపకం, బెడస కోళ్ల పెంపకం, చిరుధాన్యాల యూనిట్, పుట్టగొడుగుల పెంపకం, షేడ్ నెట్‌లో పెంచుతున్న చింత, మామిడి, అంజుర, డ్రాగన్ ఫ్రూట్ పంటలను రైతులు పరిశీలించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ కేవీకే నమూనా క్షేత్రంలో పండించిన వివిధ పంటల నాణ్యమైన విత్తనాలు, అంటు, నారు మొక్కలు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, స్వామి చైతన్య, శిల్పకళ, సాయి మహేశ్వరి, పులివెందుల వాటర్ షెడ్ ప్రాజెక్టు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వినాయకా.. వీడ్కోలిక!


దేవుని కడప చెరువులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు


రాజంపేట టౌన్: గంగ ఒడికి చేరిన గణనాథుడు

నాలుగు రోజులుగా గణపయ్యకు విశేష పూజలు చేసిన భక్తులు పెద్ద ఎత్తున నిమజ్జన వేడుకను నిర్వహించారు. శుక్రవారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో భక్తులు దారి వెంబడి కోలాట ప్రదర్శనతో వినాయకుడికి వీడ్కోలు పలికారు. యువతీ యువకులు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సాగారు. పెద్ద ఎత్తున టపాసులు కాల్చడంతో ఎటు చూసినా దీపావళిలా కాంతులు కనిపించాయి. నిమజ్జనాన్ని పురస్కరించుకొని పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

–సాక్షి నెట్‌వర్క్


రాజుపాలెంలో నిమజ్జనానికి తరలుతున్న గణపతి


కడపలో వినాయక విగ్రహాల నిమజ్జనం


ఆకట్టుకున్న విచిత్ర వేషధారణ


బద్వేలులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన విచిత్ర వేషధారణ


వేముల: ఊరేగింపులో భక్తుల కోలాటప్రదర్శన


తంబళ్లపల్లె: కేరళ వాయిద్యాలతో గణేష్ విగ్రహం ఊరేగింపు



కడపలో డూప్‌ల ప్రదర్శన

రేపటి నుంచి అండర్-23 క్రికెట్ టోర్నీ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రీడా మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడా మైదానంలో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ఏసీఏ అండర్-23 జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నమెంట్‌కు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు.


వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రీడా మైదానం

తేదీ	పోటీపడే జట్లు	వేదిక
24-09-23	నెల్లూరు - రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్	వైఎస్ఆర్ఆర్
24-09-23	కృష్ణా - రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్	కేఎస్ఆర్ఎం
24-09-23	విజయనగరం - రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్	కేఓఆర్ఎం
25-09-23	నెల్లూరు - కృష్ణా	వైఎస్ఆర్ఆర్
25-09-23	రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ - రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్	కేఎస్ఆర్ఎం
25-09-23	విజయనగరం- రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్	కేఓఆర్ఎం
26-09-23	కృష్ణ - రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్	వైఎస్ఆర్ఆర్
26-09-23	రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ - రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్	కేఎస్ఆర్ఎం
26-09-23	నెల్లూరు- విజయనగరం	కేఓఆర్ఎం
28-09-23	విజయనగరం - రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్	వైఎస్ఆర్ఆర్
28-09-23	నెల్లూరు - రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్	కేఎస్ఆర్ఎం
28-09-23	కృష్ణా - రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్	కేఓఆర్ఎం
29-09-23	రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్- రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్	వైఎస్ఆర్ఆర్
29-09-23	కృష్ణా- విజయనగరం	కేఎస్ఆర్ఎం
29-09-23	నెల్లూరు - రెస్ట్ ఆఫ్ సెంట్రల్	కేఓఆర్ఎం



సమస్యలు త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

సిద్ధవటం: స్థానిక సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. మండల కేంద్రమైన సిద్ధవటంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం స్పందన' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు గ్రామ స్థాయి సమస్యలను మండల స్థాయిలోనే త్వరిత గతిన పరిష్కారం అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగా పరిష్కరించే దిశగా మండల స్థా యిలో ప్రతి బుధ, శుక్ర వారాల్లో ఒక్కో రోజు ఒక్కో మండలంలో 'జగనన్నకు చెబుదాం స్పందన'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోలేని వారు వెంటనే వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలకు అందించే పరిష్కార నివేదికలు స్పష్టంగా ఉండాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.

- సిద్ధవటం మండలంలో తమకు నివేశ స్థలాలు కేటాయించాలని మండల పాత్రికేయులు జిల్లా కలెక్టర్ విజయరామరాజుకు అర్జీద్వారా విన్నవించారు. అందుకు ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి స్పందిస్తూ మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయిస్తామని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు శివయ్య, లక్ష్మీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వరి రెడ్డి, మాజీ సర్పంచ్ భవనాశి ఓబులయ్య, మాచుపల్లె సర్పంచ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సిద్ధవటంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: లింగ వివక్షను చూపే వారు, లింగ నిర్ధారణకు పాల్పడే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సభా భవనంలో గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో బాలికల లింగ నిష్పత్తిని గమనిస్తే బాలికల శాతం తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఆడపిల్లల శాతాన్ని పెంచాలన్నారు. స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు వంటివి జరిగితే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు.

మొల్లమాంబ ప్రతిభకు పట్టాభిషేకం

- ఉత్సవంతో పెరగనున్న జిల్లా ప్రతిష్ట
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం

కడప కల్చరల్ : జిల్లా మహిళకు అరుదైన గౌరవం దక్కనుంది. పార్లమెంటులో మహిళా బిల్లుకు ఆమోదం లభించిన రోజునే వైఎస్సార్ జిల్లాకు చెందిన తొలి తెలుగు రామాయణ కవయిత్రి మొల్లమాంబ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గోపవరానికి చెందిన మొల్ల జయంతిని ఇకపై ఏటా మార్చి 13న అధికారికంగా ఉత్సవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా జీఓ విడుదల చేసింది. ఒక సాధారణ, వెనకబడిన కులానికి చెందిన మొల్లమాంబ ప్రతిభకు ఈ నిర్ణయం పట్టాభిషేకం లాంటిదని జిల్లా సాహితీ లోకం ముఖ్యంగా మహిళా లోకం పేర్కొంటోంది. రాష్ట్ర స్థాయిలో మన జిల్లా మహిళ ప్రతిష్ట పెరగనుందని ఆనందిస్తోంది.

ధీశాలి మొల్లమాంబ

మహిళపై కట్టుబాట్లు, వివక్ష రాజ్యమేలుతున్న రోజుల్లో వెనుకబడిన కులానికి చెందిన మొల్లమాంబ 24 వేల శ్లోకాలు గల వాల్మీకి రామాయణాన్ని తన ప్రతిభతో కేవలం 371 పద్య, గద్యాలుగా రామాయణం ఔన్నత్యం ఏమాత్రం చెడకుండా సులభమైన శైలిలో అలతి అలతి పదాలతో రచించింది. సమకాలీన కవులను సైతం మెప్పించడం మొల్లమాంబకే దక్కింది. తండ్రి కేశనశెట్టి సైనిక అధికారి. తండ్రే గురువుగా విద్య నేర్చుకుంది. బాల్యంలోనే దైవాంకితమై వివాహం జోలికి వెళ్లకుండా రామాయణ రచనతోనే గడిపింది. అలాంటి గొప్ప సాహితీమూర్తి, అద్వితీయ ప్రతిభాశాలి అయిన మొల్లమాంబను గుర్తించాలని స్థానిక సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు పాతికేళ్లుగా అలుపెరగని కృషి చేస్తున్నారు. శాలివాహనులతో కలిసి కడప నగరంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన సాయంతో కోట్లాది రూపాయలు వెచ్చించి బద్వేలు-గోపవరం ప్రధాన రహదారిపై మొల్లమాంబ పేరిట హరిత టూరిజం హోటల్‌ను నిర్మింపజేసి ఆ ప్రాగణంలో ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. గోపవరంలో ఆమె కూర్చొని రామాయణం రచించిన బండను కాపాడాలని, ఆమె ఆరాధ్య దైవమైన శ్రీకంఠ మల్లేశ్వరుని ఆలయాన్ని పునర్నిర్మించాలని కోరుతున్నారు. ఏటా మహిళా దినోత్సవానికి వారం ముందు నుంచి జిల్లాలోని ఆరు ముఖ్య పట్టణాలలో మహిళలు, ఇతర సాహితీవేత్తలతో కలిసి మొల్లమాంబ పేరిట సాహిత్యోత్సవాలు నిర్వహిస్తున్నారు. మొల్ల సాహితీపీఠం ఏర్పాటు చేసి సొంత ఖర్చులతో మొల్లమాంబపై పలు పుస్తకాలు ప్రచురించారు. పలువురికి పురస్కారాలను అందజేస్తున్నారు. ప్రభుత్వమే మొల్లమాంబ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు.


మొల్లమాంబ విగ్రహం

నిన్న తండ్రి...నేడు తనయుడు

స్థానికుల విన్నపాల మేరకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బద్వేలు-గోపవరం ప్రధాన రహదారిలో మొల్లమాంబ స్మారకంగా టూరిజం హరిత హోటల్‌ను నిర్మించారు. ప్రభుత్వ పక్షాన ఆమె జయంతిని నిర్వహించేందుకు ప్రయత్నాలు సాగుతుండగా ఆయన దూరమయ్యారు. ఇప్పుడు ఆ మహానేత తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమె కీర్తికి శాశ్వత్వం కల్పించేందుకు ఏటా మార్చి 13న మొల్లమాంబ జయంతిని ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించేందుకు నిర్ణయించి జీఓ విడుదల చేశారు. ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా సాహితీవేత్తల్లో హర్షం వ్యక్తమవుతోంది.

తండ్రీ తనయుల సేవ మరువలేను



మొన్న డాక్టర్ వైఎస్సార్...నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొల్లమాంబ ప్రతిష్టను ఇనుమడింపజేశారు. ఆమె కీర్తిని అజరామరం చేసేందుకు చర్యలు తీసుకోవడం మహిళా సాహితీ లోకానికి పట్టం కట్టినట్లయింది.

- విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, అధ్యక్షులు, మొల్ల సాహితీపీఠం

అరుదైన గౌరవం దక్కింది



ఓ కవయిత్రి జయంతిని ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించడం మొల్లమాంబకే దక్కింది. ఆమె ఘనతను చాటేందుకు అందిస్తున్న సహకారాన్ని మరువలేం. ఆమె రచనలను ముద్రించాలి. పిల్లలకు పాఠ్యాంశాలుగా చేర్చాలి.

- పెండ్లిమర్రి మల్లయ్య, మొల్ల సాహితీపీఠం ఉపాధ్యక్షుడు, కడప

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలం గిరి ప్రదక్షిణ కోసం ఈనెల 28వ తేదీన జిల్లాలోని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. వీటిల్లో రాను పోను చార్జీల గురించి వివరించారు. జమ్మలమడుగు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 7.00 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఇందులో రూ. 1352 చార్జి నిర్ణయించారన్నారు. మైదుకూరు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సులు ఉదయం 6 గంటగలకు పోరుమామిళ్లలో బయలుదేరి మైదుకూరురు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుందన్నారు. ఈ బస్సులో చార్జిగా రూ. 1135, మైదుకూరు డిపోకే చెందిన మరో సర్వీసు సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతందన్నారు. ఈ సర్వీసులో రూ. 1414 చార్జిగా నిర్ణయించారన్నారు. బద్వేలు డిపోకు సంబంధించి ఉదయం 5.30 గంటలకు, 6.00 గంటలకు రెండు సర్వీసులు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళతాయన్నారు. ఇందులో రూ. 1566, రూ. 1475 చార్జీ ఉంటుందన్నారు.కడప డిపో నుంచి రాత్రి 9. గంటలకు, 29వ తేదీ ఉదయం 5 గంటలకు బస్సులు వెళతాయన్నారు.ఈ బస్సులో చార్జి రూ. 1072గా నిర్ణయించారన్నారు. పులివెందుల డిపో నుంచి ఉదయం 8.00 గంటలకు బస్సు వెళుతుందని, ఇందులో ఛార్జి రూ. 1242, ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 9.00 గంటలకు బస్సు బయలుదేరుతుందని, ఇందులో రూ. 1273 చార్జిగా నిర్ణయించారన్నారు.

క్లుప్తంగా

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న లారీ


మృతి చెందిన లక్ష్మీకర్‌రెడ్డి

ములకలచెరువు : మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఒక వృద్ధుడు దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గాయత్రి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సోంపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లికి చెందిన లక్ష్మీకర్‌రెరెడ్డి(70) తన ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా వెనకాల వైపు నుంచి వచ్చి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీకర్‌రెడ్డి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడికి భార్య మనోహరమ్మ ఉన్నారు. లారీ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సెక్యూరిటీ గార్డు విధులు ముగించుకుని వెళ్తుండగా..


విజయన్న మృతదేహం

సిద్దవటం : సెక్యూరిటీ గార్డు శుక్రవారం విధులు ముగించుకుని బైక్‌పై వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్)లో సెక్యూరిటీ గార్డుగా కతారి విజయన్న(58) పని చేస్తున్నాడు. ఈయన శుక్రవారం మధ్యాహ్నం డ్యూటీ దిగి ద్విచక్రవాహనంలో కడపకు బయలుదేరాడు. జీఎంజీ సమీపంలోని కోతుల మోరీ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విజయన్న స్వగ్రామం చాపాడు మండలం చిన్నగొడుగుటూరు కాగా, కడపలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం అయింది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టూరిస్ట్ బస్సు ప్రమాదంలో మరొకరి మృతి

- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- ఆస్పత్రిలో 11 మందికి చికిత్స



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) షబ్బీర్ మృతదేహం

సంబేపల్లె/ప్రొద్దుటూరు క్రైం : టూరిస్ట్ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. గురువారం రాత్రి ఇద్దరు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండల పరిధిలోని దేవపట్ల వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకున్న విషయం విదితమే. వివరాలు ఇలా వున్నాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని ఎస్‌బీఆర్ టూర్‌కు సంబంధించిన వీరాంజనేయ ట్రావెల్స్ బస్సును, తమిళనాడుకు చెందిన లారీ ఢీకొంది. బస్సులో మొత్తం 33 మంది ఉన్నారు. ఇందులో బస్సు డ్రైవర్, వేముల మండలం చాగలేరులోని గుండ్లపల్లెకు చెందిన కె.వెంకటనారాయణ (37).. లారీ డ్రైవర్, తమిళనాడులోని వేలూరుకు చెందిన సురేష్ (35) గురువారం రాత్రి సంఘటన స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ప్రొద్దుటూరులోని బుడ్డాయపల్లెకి చెందిన షబ్బీర్ (62) కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇంకా ఈ ప్రమాదంలో గాయపడ్డ 11 మంది ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో కర్నూలు జిల్లాకు చెందిన రమాదేవి(53), పులివెందులకు చెందిన సుబ్బలక్ష్మీ(70), వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన వై.రమాదేవి(50), జమ్మలమడుగులోని వంశీకృష్ణ (48), సులోచన (42), ప్రొద్దుటూరుకు చెందిన పార్వతమ్మ (55), ఎర్రగుంట్లలోని షేక్ సిలాభీ (30), కర్నూలు జిల్లా వెల్దుర్తిలోని నవీనారాణి (24), ప్రొద్దుటూరుకు చెందిన సుధాకర్ (60), సరళ (55), సిద్దవటంలోని నారాయణరెడ్డి(63) ఉన్నారు. వీరు రాయచోటి, కడప, తిరుపతి తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. లారీ, బస్సు డ్రైవర్లు సురేష్, వెంకటనారాయణ మృతదేహాలకు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. ప్రమాద సంఘటన స్థలాన్ని రాయచోటి రూరల్ సీఐ తులశీరామ్, సంబేపల్లి ఎస్‌ఐ షరీఫ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రోడ్డుపై ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

వెంటనే స్పందించిన స్థానికులు

సంఘటన ఊరి సమీపంలో, రాత్రి 9.30 గంటల సమయంలో జరగడంతో.. వెంటనే స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బాధితులను వెంటనే ఆస్పత్రులకు తరలించారు. దీంతో ప్రమాద నష్టాన్ని చాలా వరకు తగ్గించామని పోలీసులు పేర్కొన్నారు.

సీట్లో కూర్చోమని తమ్ముడు చెప్పినా వినిపించుకోలేదు

'బస్సులో సీట్లు ఖాళీగా ఉన్నాయి. డ్రైవర్ సీటు వెనుక వైపున పడుకోవద్దని తమ్ముడు పదే పదే హెచ్చరించాడు.. అయినా అతను వినిపించుకోలేదు'. పర్యవసానంగా లారీ ఢీకొన్న సంఘటనలో మృతి చెందాడు. సంబేపల్లె మండలంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన ఎస్‌బీఆర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆర్గనైజర్ షేక్ షబ్బీర్ గాయపడిన విషయం తెలిసిందే. అతన్ని రాత్రి కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో మృతి చెందాడు. అలాగే ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌కు చెందిన భార్యాభర్తలైన కమ్మబోయిన పార్వతమ్మ, సుధాకర్‌లు వంట చేసేందుకు బస్సులో వెళ్లారు. ఈ ప్రమాదంలో సుధాకర్‌కు కాలు విరగగా, అతని భార్య తలకు గాయాలయ్యాయి. వీరు రాయచోటి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

32 ఏళ్ల నుంచి టూరిస్టు ఆర్గనైజర్‌గా..

ప్రొద్దుటూరులోని బుడ్డాయపల్లెకు చెందిన షేక్ షబ్బీర్ 32 ఏళ్ల నుంచి ఎస్‌బీఆర్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆర్గనైజర్‌గా పని చేస్తున్నాడు. ప్రొద్దుటూరుతోపాటు కడప, అన్నమయ్య, కర్నూలు జిల్లాలకు చెందిన వారిని దేశంలోని ప్రసిద్ధి చెందిన ప్రదేశాలకు తీసుకెళ్తుంటాడు. అతనికి భార్య ముంతాజ్‌తోపాటు షుకూర్ అనే కుమారుడు, అర్షియా అనే కుమార్తె ఉన్నారు. కుమార్తె 10వ తరగతి చదువుతుండగా, కుమారుడు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రొద్దుటూరు నుంచి గురువారం బయలుదేరిన బస్సులో 27 మంది యాత్రికులు, ముగ్గురు వంట మనుషులు, ఇద్దరు డ్రైవర్లతోపాటు ఆర్గనైజర్ షబ్బీర్ ప్రయాణిస్తున్నారు. బస్సులో 12 సీట్ల వరకు ఖాళీగా ఉన్నాయి. బస్సు క్యాబిన్‌లో డ్రైవర్ సీటు వెనుక వైపు డ్రైవర్లు పడుకునేందుకు పొడవాటి సీటు ఉంటుంది. ఆ సీటులో షబ్బీర్ పడుకున్నాడు. బస్సు దారిలో ఉండగా.. అతని తమ్ముడు మహమ్మద్ యాఖూబ్ రెండు, మూడు సార్లు ఫోన్ చేసి క్యాబిన్‌లో పడుకోవద్దని, సీట్‌లో పడుకోవాలని సూచించాడు. 'ఏం కాదులే.. కొద్ది సేపటి తర్వాత పడుకుంటాన'ని షబ్బీర్ చెప్పినట్లు యాఖూబ్ తెలిపాడు. తన మాట విని ఉంటే తన అన్నకు ఈ పరిస్థితి వచ్చేది కాదని అతను రోదించసాగాడు. కాగా షబ్బీర్ కాళ్లకు మాత్రమే గాయాలయ్యాయి. దీంతో అతనికి ఏమీ కాదని అందరూ భావించారు. అయితే అతను కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు రోదించసాగారు. శుక్రవారం సాయంత్రం షబ్బీర్ అంత్యక్రియలను ప్రొద్దుటూరులో నిర్వహించారు. ప్రొద్దుటూరుతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సన్నిహితులు, తరచూ టూర్‌కు వెళ్లే ప్రముఖులు షబ్బీర్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


షబ్బీర్ (ఫైల్)

కారు, బైక్ ఢీకొని
వ్యక్తి దుర్మరణం


భర్త మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య


జావేద్ హుసేన్ (ఫైల్)

చెన్నూరు : చెన్నూరు మండలం కడప- కర్నూలు జాతీయ రహదారి శేషయ్యగారిపల్లె వద్ద శుక్రవారం కారు, బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరు మైనార్టీ కాలనీ ఏటిగడ్డ వీధికి చెందిన జావేద్ హుసేన్(36) కడపలోని బండల ఫ్యాక్టరీలో పని చేస్తూ జీవనం సాగించే వాడు. శుక్రవారం మధ్యాహ్నం కడప నుంచి చెన్నూరుకు బైక్‌పై బయలుదేరాడు. కడప నుంచి మైదుకూరు మీదుగా వెళుతున్న కారు శేషయ్యగారిపల్లె వద్దకు రాగానే సడన్‌గా వేగం తగ్గించడంతో.. వెనుక వైపు నుంచి బైక్‌పై వస్తున్న జావిద్ హుస్సేన్ అదుపుతప్పి ఢీకొని కింద పడిపోయాడు. అతని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. భర్త మృతదేహంపై పడి భార్య గుండెలవిసేలా రోదించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫేక్ ఇన్సూరెన్స్ తీసుకొని మోసపోవద్దు


మాట్లాడుతున్న డీటీసీ మీరాప్రసాద్

ప్రొద్దుటూరు క్రైం : మార్కెట్‌లో కొందరు వ్యక్తులు ఫేక్ ఇన్సూరెన్స్ కట్టించి మోసగిస్తున్నారని, వారి పట్ల ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని కడప డీటీసీ మీరాప్రసాద్ అన్నారు. పట్టణంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ధరకు ఇస్తున్నారని అపరిచిత వ్యక్తుల నుంచి ఆటోలకు ఇన్సూరెన్స్ చేయించుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా తీసుకున్న ఇన్సూరెన్స్ పాలసీలు చెల్లవని, ఒక వేళ ఆటో ప్రమాదానికి గురై డ్రైవర్‌కు జరగరానిది జరిగితే ఇన్సూరెన్స్ వర్తించదని చెప్పారు. ఫలితంగా వారిని నమ్ముకున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ఆటో డ్రైవర్ల కష్టాలను కళ్లారా చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇన్సూరెన్స్‌తోపాటు ఎఫ్‌సీ, ఆటో రిపేర్ల కోసం వైఎస్సార్ వాహనమిత్ర కింద ఏటా రూ.10 వేలు అందిస్తున్నారన్నారు. ఆ డబ్బుతో గుర్తింపు కలిగిన ఇన్సూరెన్స్ కంపెనీ కార్యాలయాలకు వెళ్లి ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టుకోవాలని సూచించారు. ఆటో వాళ్లలో చాలా మంది చదువుకున్న వారు లేకపోవడంతో కొందరు మోసగాళ్లు తేలిగ్గా మోసగిస్తున్నారని చెప్పారు. ఎవ్వరి చేతిలోనూ మోసపోవద్దని తెలిపారు. ప్రొద్దుటూరుకు రాష్ట్రంలోనే బంగారం వ్యాపారంలో మంచి పేరుందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కొత్త వ్యక్తులకు మొదట పరిచయమయ్యేది ఆటో డ్రైవర్లేనని తెలిపారు. కొత్త వ్యక్తుల పట్ల గౌరవంగా, మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఈ నెల 29న ప్రభుత్వం వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్, ఏఓ కరీముల్లా, ఏఎంవీఐ శ్రీనివాసరెడ్డి, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చీర కొంగు
బైక్ టైరుకు చుట్టుకుని..

కురబలకోట : తల్లిని బైక్‌పై ఎక్కించుకుని ఓ కొడుకు వెళ్తున్నాడు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఊహించని ఘోరం జరిగింది. ఆమె చీర కొంగు కాస్తా బైక్ వెనుక టైర్‌కు చుట్టుకుని కింద పడిపోయింది. కన్న కొడుకు కళ్ల ముందే ఆ తల్లి ఊపిరి వదిలింది. ముదివేడు ఏఎస్‌ఐ గజేంద్ర కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం కుక్కరాసిపల్లెకు చెందిన మల్లీశ్వరి(48) చిన్న కుమారుడు మోహన్‌తో కలిసి బైక్‌లో శుక్రవారం మదనపల్లె వెళ్లింది. వెంటనే స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. మార్గం మధ్యలోని గౌనివారిపల్లె వద్ద బైక్‌లో వెనుక చక్రానికి మల్లీశ్వరి చీర చుట్టుకుంది. దీంతో ఆమె వెనుకకు ఉన్నపాటున వెల్లకిలా రోడ్డుపై పడిపోయింది. తలకు బలమైన గాయమైంది. అధికంగా రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ హఠాత్పరిణామంతో మోహన్ తల్లి మృతదేహం వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. 'ఎంత పని జరిగిందమ్మా' అంటూ బోరున విలపించడంతో.. చూపరుల కళ్లు చెమ్మగిల్లాయి. మృతదేహానికి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.3.60 లక్షలు పలికిన గణేష్ లడ్డూ


లడ్డూను సొంతం చేసుకున్న శ్రీనివాసులరెడ్డి

బద్వేలు అర్బన్: స్థానిక తెలుగుగంగకాలనీ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా శుక్రవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వామి వద్ద ఉంచిన లడ్డూను రూ.3.60 లక్షలకు అల్లంపాటి శ్రీనివాసులరెడ్డి సొంతం చేసుకున్నారు. వెండి కలశం చెంబును ఎస్.కళ్యాణమ్మ రూ.89 వేలకు, కరెన్సీ నోట్ల దండను పి.వెంకటరెడ్డి రూ.60 వేలు, వెండి దీపాలు ఎ.వెంకటరమణారెడ్డి రూ.54 వేలకు, వెండి విగ్రహం రూ.50 వేలకు పి.కృష్ణారెడ్డి, వెండి కుంకుమభరిణె డి.లక్ష్మిరెడ్డి రూ.35 వేలకు, వెండి పుష్పాలు పి.జయసుబ్బారెడ్డి రూ.25 వేలకు, పంచామృతం గిన్నెలు బి.పెంచల్‌రెడ్డి రూ.23 వేలకు, పండ్లు ఎం.శ్రీలత రూ.10 వేలు, చెరుకుగడలు యు.సుబ్బిరెడ్డి రూ.8 వేలకు సొంతం చేసుకున్నారు. భక్తులను నిర్వాహకులు సన్మానించారు.



శేషుడిపై శ్రీరంగనాథుడు

నూలుపూజ పవిత్రోత్సవాల్లో భాగంగా పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్రోత్సవాలలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులతో పూజలు జరిపించారు. ఆలయ చైర్మెన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. -పులివెందుల టౌన్

జూదరుల అరెస్ట్

చెన్నూరు : మండల పరిధి కడప ఎయిర్‌పోర్టు సమీపంలోని బహిరంగ ప్రదేశంలో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,600 స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కథ చెబుతుండగా..
కళాకారుడికి గుండెపోటు

– చికిత్స పొందుతూ మృతి


సాసవల చిన్నమ్మ పాత్రలో.. (ఫైల్) రామాంజనేయులు మృతదేహం

లక్కిరెడ్డిపల్లి : కథ చెబుతుండగానే ఓ కళాకారుడికి గుండెపోటు వచ్చింది. ఈ హఠాత్పరిణామంతో వెంటనే స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పాలెం గొల్లపల్లి గ్రామం చిన్న పోతులపల్లికి చెందిన కిన్నెర రామాంజనేయులు (35) కళని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. ఆయన పదేళ్లుగా సాసవల చిన్నమ్మ కథను నాటకం ద్వారా గ్రామాల్లో చెబుతున్నాడు. నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల వారికి సుపరిచితుడయ్యాడు. రాయచోటి మండలంలోని గొల్లపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు సాసవల చిన్నమ్మ కథ చెబుతుండగా.. గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. తల్లి కువైట్‌లో ఉండగా, తండ్రి ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, రామాపురం, రాయచోటి, చక్రాయపేట మండలాలలోని కళాకారులు రామాంజనేయులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

గ్రావెల్ రోడ్డు బిల్లు సొమ్ము స్వాహా?

పంచాయతీ కార్యదర్శి చేతివాటం

ముద్దనూరు : గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చెందిన గ్రావెల్ రోడ్డు బిల్లులో పంచాయతీ కార్యదర్శి(డీడీవో) చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారు. వివరాలలోకి వెళ్తే.. దేనేపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి జాయింట్ ఖాతా నుంచి రూ.6 లక్షల 82 వేల సొమ్మును కార్యదర్శి కాజేసినట్లు సమాచారం. సుమారు ఏడాది క్రితం గ్రావెల్ రోడ్డు పనులకు చెందిన సొమ్ము గ్రామ పంచాయతీకి చెందిన జాయింట్ అకౌంట్‌లో జమ అయింది. అయితే కార్యదర్శి ఈ సొమ్ములో రూ.5 లక్షల70 వేలను ఒక ఖాతాలో జమ చేశారు. మిగతా సొమ్మును మరో గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేశారు. గత కొద్ది రోజుల క్రితం తమ బిల్లు కోసం బాధిత వ్యక్తి అధికారులను ఆశ్రయించారు. అధికారులు రికార్డులు పరిశీలించి బిల్లు గ్రామ పంచాయతీ ఖాతాలోకి జమ చేసినట్లు తెలిపారు. బిల్లు సొమ్ముపై ఆరా తీయగా.. పంచాయతీ కార్యదర్శి సొమ్మును తనకు అనుకూలమైన ఖాతాల్లో జమ చేసినట్లు విషయం తెలిసింది. పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ సొమ్మును కాజేసిన సంఘటనపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూర్యనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. రోడ్డు బిల్లుకు చెందిన డబ్బు కాజేసినట్లు తెలిసిందని, గత వారం రోజుల నుంచి కార్యదర్శి విధులకు హాజరు కావడం లేదని తెలిపారు. ఇప్పటికే కార్యదర్శి గైర్హాజరు, ఇతర విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పేర్కొన్నారు.

విధులకు డుమ్మా..!

పెద్దముడియం : మండలంలోని వేర్వేరు ప్రభుత్వ పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడుతున్నారు. వివరాలలోకి వెళితే... తురకపల్లె ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా ఎస్.రహమతుల్లాహుసేనీ విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 5 నుంచి పాఠశాలకు గైర్హాజరవుతున్నారు. పాఠశాలలో 51 మంది విద్యార్థులు ఉండగా, ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే హెచ్‌ఎం గత కొన్ని రోజులుగా పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 8 తరగతులను ఇద్దరు ఉపాధ్యాయులు చూసుకొంటున్నారు. కాగా గతేడాది ఈ హెచ్‌ఎం పాఠశాలలో విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలిపై చెయ్యి చేసుకోవడం వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉపాధ్యాయురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌ఎంపై ఫిర్యాదు చేసింది. ఉపాధ్యాయురాలి ఫిర్యాదు మేరకు హెచ్‌ఎంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే గుర్రంకొండ మండలానికి చెందిన వ్యక్తులు వచ్చి హెచ్‌ఎం నుంచి ఉపాధ్యాయురాలికి సారీ చెప్పించి, ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. దీంతో కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ఇద్దరు రాజీపోవడంతో ఆ సమస్య ముగిసిపోయింది. తాజాగా హెచ్‌ఎం విధులకు డుమ్మా కొట్టడంతో విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని బందెపురెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రవీంద్ర ఆగస్టు నుంచి విధులకు రావడం లేదని సమాచారం. పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే హెచ్‌ఎం విధులకు గైర్హాజరు కావడంతో 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయురాలే పాఠాలు బోధిస్తున్నారు. వేర్వేరు పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఎటువంటి సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొడుతున్న వైనంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు ఎంఈవో 2 రామక్రిష్ణ 'సాక్షి' కి తెలిపారు.

నాటు సారా, కర్ణాటక మద్యం కేసుల్లో నలుగురి అరెస్ట్

మదనపల్లె : ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో నాటు సారా తయారీ, విక్రయాలు, కర్ణాటక మద్యం అక్రమరవాణా, అమ్మకాలకు సంబంధించిన నేరాల్లో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...

బి.కొత్తకోట మండలం బాలసానిపల్లెకు చెందిన ముద్దమ్మగారిబాబు(48) ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం 48 టెట్రాప్యాకెట్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మదనపల్లె-పుంగనూరు రోడ్డు బోయకొండ క్రాస్‌వద్ద ద్విచక్రవాహనంలో నాటుసారా తరలిస్తున్న నారమాకులపల్లె తండాకు చెందిన బాణావత్ జగదీష్(24)ను అదుపులోకి తీసుకుని, 75 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో అక్రమ కర్ణాటక మద్యం కేసులో అరెస్ట్ కాకుండా తప్పించుకు తిరుగుతున్న బి.కొత్తకోట మండలం చిన్నంపల్లెకు చెందిన ఎర్రమద్దు ప్రభాకరరెడ్డి(45)ని మదనపల్లె-చింతామణి మార్గంలోని మేడిపల్లె క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అలాగే మదనపల్లె పట్టణంలో నాటుసారా కేసుకు సంబంధించి అరెస్ట్ కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఎం.మంగమ్మ(45)ను నీరుగట్టువారిపల్లె మామిడి కాయల మండీ సమీపంలో అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులకు సంబంధించిన నలుగురు నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిస్తే.. వారికి 14రోజుల రిమాండ్ విధించారన్నారు. దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్‌ఐ అంజద్‌బాషా, బీఎంపీపీ ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది హరికుమార్, త్రిపురేంద్రుడు, మునిరామయ్య, దామోదర్, ప్రసన్నకుమార్, లవకుమార్, బాలకృష్ణ, రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

– చోరీ యత్నం విఫలం

కలికిరి : పట్టణ నడిబొడ్డున గల కొత్తపేట వీధిలో గురువారం అర్ధరాత్రి దొంగల ముఠా హల్‌చల్ సృష్టించడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట వీధిలో మామిడి కాయల వ్యాపారి ఉనాయతుల్లా ఇల్లు, హబీబ్‌ఖాన్ టైలర్ షాపు పక్కపక్కనే ఉన్నాయి. ఆ పక్కనే హబీబ్‌ఖాన్ ఇల్లు కూడా ఉంది. రోజూ సాయంత్రం ఆయన షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్తాడు. ఈ విషయాన్ని దొంగల ముఠా గమనించింది. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో ముందుగా చుట్టు పక్కల ఇళ్లకు బయటి నుంచి గడియ పెట్టారు. ఉనాయతుల్లా ఇంటి గేటు, హబీబ్‌ఖాన్ టైలర్ షాపు తాళాలు పగులకొడుతుండగా.. సంబంధీకులు గమనించారు. లోపలి నుంచి అరచినా పట్టించుకోకుండా చోరీలో నిమగ్నమయ్యారు. రెండిళ్లకు దర్జాగా తాళాలు పగులగొట్టారు. ఇంటి లోపలున్న వారు దగ్గరలో ఉన్న స్థానికులు, పోలీసులకు ఫోన్‌లో సమాచారమిచ్చి వెంటనే రావాలని కోరారు. దీంతో స్థానికులు అప్రమత్తమైన సమాచారం తెలుసుకున్న దొంగలు అక్కడి నుంచి జారుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చుట్టుపక్కల ఇళ్ల గడియ తీసి, దుండుగులు పగులకొట్టిన తాళాలను పరిశీలించారు. స్థానిక యువకులు, పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.